# ఇన్ ది గేప్

నౌకార్ పార్క్ చేసి వస్తుండగా క్రైం బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శర్మ మోటార్ సైకిల్ ఆగడం కన్పించింది.

"గుడ్మార్నింగ్ డాక్టర్!" నన్ను చూసి విష్ చేశాడు.

"ఏమిటి శర్మగారూ! పొద్దున్నే దర్శనమిస్తున్నారు?" నేను కూడా విష్ చేస్తూ అడిగాను.

శర్మ నవ్వి చెప్పాడు "మామూలే డాక్టర్!... మెడికో లీగల్ కేస్!"

"రండి ...ఏమిటి వివరాలు?" నా రూం వైపు నడుస్తూ అడిగాను.

"మీ ఇల్లు వున్న పక్క లైన్‌లోనే... నరసింహమూర్తిగారబ్బాయి వారం రోజుల క్రితం చనిపోయాడు. మీకు తెల్సే వుంటుంది"

"ఆ... ఆ, బాడీని అప్పుడే పాతేసారు కదా"

"నరసింహమూర్తిగారి మావగారికి అది సహజమైన చావు కాదేమోననే అనుమానం రావడంతో కథంతా తిరగదోడాల్సి వచ్చింది... మీరు కొంచెం తొందరగా పోస్టుమార్టమ్ రిపోర్టులు అంద జేస్తే మా పని సులువవుతుంది... అందుకే నేనే పర్సనల్‌గా వచ్చాను"

"ఓ. ష్యూర్... బహుశా రొటీన్ కేసే అయ్యుంటుంది. చిన్న పిల్లలలో సడన్ డెత్ రాకూడదని లేదుగా... అయినా అంత చిన్న పిల్లాడ్ని హత్య చెయ్యాల్సినంత అవసర మెవరి కుంటుంది.... రేపు సాయంత్రం... రేపు ప్రొద్దున్న... తీకల్లా రండి. రిపోర్టు రెడీ చేసి ఉంచుతాను"

"థాంక్యూ డాక్టర్!" అతడు నిష్క్రమించాడు.

పదేళ్ళ కిరణ్ మరణం మా కాలనీలో సంచలనం సృష్టించిందనే . చెప్పాలి. నరసింహమూర్తి ఆంధ్రా యూనివర్సిటీలో సీనియర్ కెమికల్ ఎనాలసిస్ట్‌గా పని చేస్తున్నాడు. చాలా మంచి వ్యక్తి. పెళ్ళయిన అయిదేళ్ళకి లేక లేక పుట్టిన 'కిరణ్' అంటే అతడికి పంచ ప్రాణాలు. అతని మావగారికి ఎనభై ఏళ్ళుంటాయి. ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్లో పని చేసి విపరీతంగా గడించాడు. ఆ దంపతులిద్దరూ ఎవరిదో పెళ్ళికని ఢిల్లీ వెళ్తూ కిరణ్‌ని తాత దగర వదిలేసి వెళ్ళిపోయారు. వాళ్ళు వెళ్ళిన మర్నాడే కిరణ్ వాళ్ళ తాతగారు రాసిన లెటర్సు పోస్టు చెయ్యడానికి వెళ్తూ హఠాత్తుగా విరుచుకొని పడి పోయాడట..., ఇంట్లో వున్న నల్గురు పనివాళ్ళూ నమ్మకస్థులే. ఎంత కిరాతకుడికైనా చూస్తూ చూస్తూ పసివాడి ప్రాణాలు తియ్యాలనిపిస్తుందా... హఠాత్తుగా నరసింహమూర్తి దంపతుల గర్భశోకం కళ్ళ ముందు మెదిలి కడుపులో దేవినట్టనిపించింది.

** ** **

పోస్టుమార్టమ్ రిజల్ట్సు చూసి నేను అదిరి పోయాను. అది సైనేడ్ పాయిజినింగ్ కేస్!.

** ** **

ఓ వారం రోజులు పోయిన తర్వాత శర్మ కన్పించి చెప్పాడు, డాక్టర్! ఎల్లుండి మీరు ఎక్స్‌పర్ట్ ఎవిడెన్స్ చెప్పడం కోసం కోర్టుకి రావల్సి ఉంటుంది"

"ష్యూర్! ఇంతకీ నిందితు డెవరో తేలిందా"

"పెద్దగా కష్టపడకుండానే బయటపడిపోయాడు"

"ఎవరు?" టెన్షన్‌గా ముందుకి వంగి అడిగాను.

"నరసింహమూర్తి!"

"మై గాడ్!" నాకు ఒక్కసారిగా షాక్ కొట్టినట్ట య్యింది" కిరణ్ ఫాదర్ గురించా మీరు చెప్పేది?"

"యెస్ డాక్టర్! మేం రొటీన్‌గా అందర్నీ ప్రశ్నిస్తున్నప్పుడు అతడు హఠాత్తుగా బరెస్ట్ అయిపోయాడు. నేనే నా బాబుని చంపేసాను అంటూ మా ముందే ఏడ్చేసాడు"

"బట్ హౌ ఈజిట్ పాసిబుల్, ఆ టైంలో అతడు వేరే ఊర్లో ఉన్నాడు కదా?" అతడు చెప్పింది ఇంకా జీర్ణించుకోలేక పోతున్నాను.

"వాళ్ళ మావగారు రాసిన ఇన్‌లేండ్ లెటర్స్‌కి గమ్ స్థానంలో సైనైడ్ పూయబడింది. ఒక వేళ ఆయనే ఆ కవర్లని నాలికతో తడి చేసి అంటించి వుంటే...ఎనభై ఏళ్ళ వృద్ధుడు కాబట్టి అందరూ సహజమరణమనే అనుకొని ఉండేవారు. కానీ అతడు రాసేసిన తర్వాత, అతికించి పోస్టు చెయ్యమని మనవడికి ఇవ్వడంతో..."

మనిషిలోని మానవత్వాన్ని అప్పుడప్పుడు 'డబ్బు' అనే పదార్థం ఎలా ఫుట్‌బాల్ ఆడుతుందో తలచుకుంటూనే వింతగా అన్పించింది. కళ్ళు మూసుకొని వెనక్కి జారగిలబడ్డాను శర్మ చెప్పేది వింటూ.

–డాక్టర్ కర్రి శివాజి

